క్లుప్తంగా

కోరం లేక సమావేశం వాయిదా

గురజాల: కోరం లేక మున్సిపల్ సమావేశం వాయిదా పడింది. ప్రతి నెల చివరలో జరిగే మునిసిపల్ సమావేశానికి కౌన్సిలర్లు ఎవరూ హజరుకాకపోవడంతో వాయిదా పడింది. పాలక మండలి సభ్యులు అనుమతి లేకుండా అధికారులు తమ ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తున్నారని, అందువల్లే సమావేశానికి గైర్హాజరు అయినట్లు పలువురు కౌన్సిలర్లు తెలిపారు. పాలక మండలికి అనుకూలమైన వారిని నియమించుకుని ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. నగర పంచాయతీ అధికారులు సమావేశం జరగలేదని, ఏ పనులు ఆమోదం జరగలేదని సమావేశం వాయిదా పడిందని తెలిపారు.

దాతల సహకారం మరువలేనిది



గురజాల: పేదలకు అన్నసంతర్పణ కోసం దాతలు చేస్తున్న సహకారం మరువలేనిదని స్మైల్ ఫౌండేషన్ అధ్యక్షుడు గుండా కాశీవిశ్వనాథం చెప్పారు. స్థానిక పాతపాటేశ్వరి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో పేదలకు స్మైల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని దానాల కన్నా అన్నదానం గొప్పదని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ సేవా దృక్పథం కలిగి ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో స్మైల్ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

మున్సిపల్ డీఈగా శ్రీనివాసరావు



పిడుగురాళ్ల: పిడుగురాళ్ల మున్సిపల్ డీఈగా శ్రీనివాసరావు బాధ్యతలు చేపట్టారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం ఆయన బాధ్యతలను చేపట్టారు. ఆయన నరసరావుపేట నుంచి బదిలీపై పిడుగురాళ్ల మున్సిపల్ డీఈగా వచ్చారు. ఇక్కడ డీఈగా పని చేస్తున్న సత్యనారాయణ ఉద్యోగ విరమణ చేయటంతో అప్పటి నుంచి ఈ పోస్టు ఖాళీగా ఉంది. సాధారణ బదిలీలలో భాగంగా శ్రీనివాసరావు పిడుగురాళ్ల మున్సిపాలిటీకి వచ్చారు.

సబ్ రిజిస్ట్రార్‌గా ఐజాక్



మాచర్ల: మాచర్ల సబ్ రిజిస్ట్రార్‌గా పి.ఐజాక్ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు సబ్‌రిజిస్ట్రార్‌గా పని చేసిన ప్రశాంతి గురజాల సబ్‌రిజిస్ట్రార్‌గా బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో గిద్దలూరు నుంచి బదిలీపై మాచర్ల పట్టణానికి వచ్చిన ఐజాక్ సబ్ రిజిస్ట్రార్‌గా బాధ్యతలు చేపట్టారు.

యూడీసీగా కిరణ్‌కుమార్

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో యూడీసీగా మంగళవారం పల్నాడు జిల్లా ఫిరంగిపురం నుంచి బదిలీపై వచ్చిన కిరణ్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారు. వీరిని సబ్‌రిజిస్ట్రారు కార్యాలయ సిబ్బంది, స్టాంప్ వెండర్లు అభినందించారు.

రసాయన ఎరువుల వాడకం తగ్గించాలి



దాచేపల్లి: రసాయన ఎరువుల వాడకం తగ్గించాలని ఏఓ డి.పాపకుమారి చెప్పారు. రామాపురం, పొందుగల గ్రామాల్లో పొలంపిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. పత్తి పంట సాగులో రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. రసాయన ఎరువులకు బదులుగా జీవన ఎరువులు వాడాలని ఏవో పాపకుమారి చెప్పారు. పత్తి పంటను ఆశించే రసం పీల్చే పురుగుల నివారణకు, పచ్చదోమ నివారణకు ఎసిఫేట్, పేనుబంక నివారణకు ఇమిడాక్లోప్రిడ్, తామర పురుగు నివారణకు ఫిప్రోనిల్, తెల్ల దోమ నివారణకు ప్రోఫినోపాస్ వినియోగించాలని సూచించారు. రైతుభరోసా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పంట నమోదు తప్పనిసరి



పిడుగురాళ్లరూరల్: పంట నమోదు తప్పనిసరిగా చేసుకోవాలని ఏవో శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు. మండలంలోని పెద అగ్రహారం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రతి రైతూ పంట నమోదు చేయించుకోవాలని సూచించారు. పంట నమోదు వల్ల ఉపయోగాలు, బీమా గురించి వివరించారు. జిల్లా కో–ఆర్డినేటర్ వాల్యూ ఆయిల్స్ కంపెనీ నవీన్ మాట్లాడుతూ.. ఆయిల్ పామ్ పంట గురించి వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

‘గొయ్యి’మొర్రో



పట్టణంలోని శ్రీనివాస కాలనీ రైల్వే గేటు బజారులో వాటర్ పైపులైన్ లీక్ కావటంతో రోడ్డు మొత్తం తవ్వారు. మూడు రోజులుగా గుంత తవ్వి వాటర్ పైపు మరమ్మతులు చేశారు. గుంతను మాత్రం పూడ్చలేదు. దీంతో రాకపోకలకు ఈ రహదారి అంతరాయంగా మారింది. మున్సిపల్ అధికారులు తక్షణమే గుంతను పూడ్చాలని స్థానికులు కోరుతున్నారు.

– పిడుగురాళ్ల

సేవలు అభినందనీయం



డ్వాక్రా మహిళలను చైతన్య పరిచి ప్రభుత్వ పథకాలు అందించి ఐదేళ్లు మాచర్ల పట్టణంలో సుదీర్ఘ సేవలు అందించిన మెప్మా ప్రాజెక్టు మేనేజర్ సుబ్బారావు, సీఈఓ రమణరావు అభినందనీయులని మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు అన్నారు. వారిద్దరూ బదిలీ అయిన సందర్భంగా మెప్మా కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన ఆత్మీయ సభలో మున్సిపల్ చైర్మన్ నరసింహారావు ముఖ్య అతిథిగా మాట్లాడారు. సుబ్బారావు, నరసింహారావుల సేవలను కొనియాడారు. వారిని సత్కరించారు. కార్యక్రమంలో రాజశేఖర్, అంజలి తదితరులు పాల్గొన్నారు. –మాచర్ల

పంచాయతీ నిధుల దుర్వినియోగంపై ఫిర్యాదు



ఎస్ఐ శివనాగరాజుకు ఫిర్యాదు చేస్తున్న సర్పంచ్, ఇన్‌చార్జి సర్పంచ్ బొడ్డు నర్సమ్మ, బాణావత్ కోటమ్మ

దాచేపల్లి: మండలంలోని కొత్తూరు గ్రామంలో పంచాయతీ నిధుల దుర్వినియోగంపై మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కొత్తూరు గ్రామ పంచాయతీలో రూ.6.08 లక్షల పంచాయతీ నిధులను కార్యదర్శి రామకోటేశ్వరరావు దుర్వినియోగం చేశారని సర్పంచ్‌లు బొడ్డు నర్సమ్మ, ఇన్‌చార్జి సర్పంచ్ బాణావత్ కోటమ్మలు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ దాసరి శివనాగరాజును కలిసి ఫిర్యాదు చేశారు. సర్పంచ్‌లు ఇచ్చిన ఫిర్యాదుపై విచారణ చేస్తామని ఎస్ఐ శివనాగరాజు చెప్పారు. అనంతరం నర్సమ్మ, కోటమ్మలు విలేకరులతో మాట్లాడారు. కొత్తూరు గ్రామ పంచాయతీ కార్యదర్శి రామకోటేశ్వరరావు తమ అనుమతులు, సంతకాలు లేకుండా ఈ ఏడాది మార్చి 19న రూ.1,65 లక్షలు, గత సెప్టెంబర్ 6,7 తేదీల్లో రూ.1,60 లక్షలు, గతేడాది మే 3న రూ.98వేలు గ్రామ పంచాయతీ ఖాతాల నుంచి డ్రా చేశారని, ఇంటి పన్నులు పూర్తిగా చెల్లించకపోతే చెక్ పవర్ రద్దు అవుతుందని చెప్పి తమ వద్ద నుంచి రూ 65వేలు తీసుకుని తిరిగి ఇవ్వలేదని, గ్రామంలో చేపల చెరువు వేలం పాట ద్వారా వచ్చిన రూ1,25 లక్షలు, చేపలు అమ్మితే వచ్చిన రూ.60 వేల నగదునూ సొంతానికి వాడుకున్నారని పేర్కొన్నారు. పంచాయతీ నిధుల డ్రా విషయం తెలిసి ప్రశ్నిస్తే.. సర్పంచుల ప్రమేయం లేకుండానే డ్రా చేసుకోవచ్చని, టీడీపీ నేతలు గతంలో చేసిన పనులకు బిల్లులు చెల్లించామని కార్యదర్శి దురుసుగా బదులిచ్చారని వెల్లడించారు. కార్యదర్శిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని నర్సమ్మ, కోటమ్మ కోరారు. వీరి వెంట ఎంపీపీ కందుల జాను, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ జాకీర్‌హుస్సేన్, మార్కెట్ యార్డు మాజీ డైరెక్టర్ నాళం శ్రీనివాసరావు ఉన్నారు.

తహసీల్దార్ కార్యాలయంలో బదిలీలు

మాచర్ల రూరల్: తహసీల్దార్ కార్యాలయంలో ఉద్యోగులను బదిలీ చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. డెప్యూటీ తహసీల్దార్లుగా పనిచేస్తున్న దుగ్గరాజు శ్రీనివాసరావు గురజాలకు బదిలీ అయ్యారు. ఈయన స్థానంలో గురజాల నుంచి రామాంజనేయులు రానున్నారు. అలాగే ఎన్నికల డీటీ షేక్ బాషా వెల్దుర్తికి వెళ్లనున్నారు. ఆయన స్థానంలో గురజాల నుంచి వెంకటరమణ నియమితులయ్యారు. డీటీ సుధాకర్ శర్మ పిడుగురాళ్లకు వెళ్లనుండగా, గురజాలలో డెప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తున్న బత్తుల వాణి మాచర్లకు రానున్నారు. వీరితో పాటు ఆర్ఐ నిమ్మల శ్రీనివాసరావు గురజాలకు, ఎన్నికల సీనియర్ అసిస్టెంట్ షేక్ మస్తాన్‌వలి వెల్దుర్తి మండలానికి బదిలీపై వెళ్ళనున్నారు.

వీఆర్ఓల బదిలీలు

వీఆర్వోల బదిలీలూ జరిగాయి. ఎం.గోపాలరెడ్డి రాయవరం నుంచి యడ్లపాడుకు, ఆరుమళ్ళ నాగేశ్వరరావు అమరావతి నుంచి మాచర్లకు, దుర్గి మండలం పోలేపల్లిలో పనిచేస్తున్న వి.గంగమ్మ విజయపురిసౌత్‌కు, ఎం.రవికుమార్ మాచర్ల టౌన్ నుంచి విజయపురిసౌత్‌కు, ఎ.నాగేశ్వరరావు యండ్రాయ్ గ్రామం నుంచి పట్టణంలోని నెహ్రూనగర్‌కు, కె.వెంకట్రావు గుండ్లపాడు నుంచి రాయవరానికి, కె.చిరంజీవి నాయక్ కొత్తూరు నుంచి అమరావతి 1కు, వైపీ మూర్తి వీపీసౌత్ నుంచి అడిగొప్పలకు, షేక్ జలీల్ కొప్పునూరు నుంచి తాళ్ళపల్లికి, జి.భాస్కర్ జమ్మలమడక నుంచి కొప్పునూరుకు, పుల్లగూర ప్రశాంతి పశువేముల నుంచి మాచర్లకు, మేరాజోత్ లాల్ సింగ్ మాచర్ల నుంచి నూజెండ్లకు, మణికుమార్ దాచేపల్లి నుంచి జమ్మలమడకకు, ఈర్ల దుర్గ రచ్చమల్లపాడు నుంచి కొత్తూరుకు బదిలీ అయ్యారు.

బ్రాహ్మణులపై దాడులు హేయం



సత్తెనపల్లి: బ్రాహ్మణులపై దాడి చేస్తే అట్రాసిటీ లాంటి బలమైన చట్టం ప్రభుత్వాలు తీసుకురావాలని బ్రాహ్మణ ఐక్య వేదిక సత్తెనపల్లి డివిజన్ అధ్యక్షుడు పెద్దింటి ఫణి కృష్ణ పేర్కొన్నారు. తాడికొండ మండలం పొన్నెకల్లు కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయ అర్చకుడి మీద జరిగిన దాడిని మంగళవారం ఆయన ఖండించారు. పట్టణంలోని అచ్చంపేట రోడ్‌లోని శివాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అర్చకులు మీద దాడి చేయడం చాలా బాధాకరమన్నారు. భవిష్యత్తులో ఇలాంటి దాడులు జరగకుండా బలమైన చట్టాన్ని ప్రయోగించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, బ్రాహ్మణ జాతి భవిష్యత్తు కాపాడాలని కోరారు. అర్చక సంఘ నాయకులు అమంచి రవికుమార్, పురుషోత్తమ శర్మ, సాధు శివ ప్రసాద్, దీవి శేషుబాబు, మార్కండేశర శర్మ, తులసి కృష్ణ బట్టర్, సంపత్ కుమార్, బాలాజీ, బ్రాహ్మణ నాయకులు పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయుడిని సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు

నరసరావుపేట ఈస్ట్: విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శించిన కారెంపూడిలోని బ్రాహ్మనాయుడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి.అనంతశివను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ పి.అరుణ్‌బాబు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. కలెక్టర్ అరుణ్‌బాబు సెప్టెంబర్ 13వ తేదీన పాఠశాలను సందర్శించిన సమయంలో హాజరు శాతం తక్కువగా ఉండటం, మధ్యాహ్న భోజనం విద్యార్థులకు అందించకపోవటం, పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటం వంటి అంశాలను గమనించారు. విధి నిర్వహణలో హెచ్ఎం అనంతశివ నిర్లక్ష్యంగా వ్యవహరించటం పట్ల కలెక్టర్ అరుణ్‌బాబు ఆగ్రహం వ్యక్తం చేయటంతోపాటు గురజాల డివిజన్ అభివృద్ధి అధికారిని విచారణాధికారిగా నియమించారు. అధికారి ఇచ్చిన నివేదిక ఆధారంగా హెచ్ఎం అనంతశివను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. సస్పెన్షన్ కాలంలో ముందస్తు సమాచారం లేకుండా హెడ్‌క్వార్టర్‌ను వదిలి వెళ్లరాదని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

భక్తిశ్రద్ధలతో ఏకాహం రుద్రాభిషేకం

పెదకూరపాడు: 75 తాళ్లూరు అవధూత అయోధ్యస్వామి ఆశ్రమంలో మంగళవారం మాస శివరాత్రి పురస్కరించుకొని భక్తులు భక్తిశ్రద్ధలతో మహన్యాస రుద్రాభిషేకాలు, ఏకాహం రుద్రాభిషేకం శివలింగానికి అయోధ్య స్వామి ఉత్సవ విగ్రహానికి భక్తులతో పంచామృత అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో వేద పండితులు ఆదిత్యశర్మ పాల్గొని, మాట్లాడారు. లోక కల్యాణం కోసమే ఏకాహం రుద్రాభిషేకాలు నిర్వహించుకోవడం పూర్వజన్మ సుకృతమన్నారు. మాస శివరాత్రి పురస్కరించుకొని మహన్యాస రుద్రాభిషేకాలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తే గ్రామంలో పాడి పరిశ్రమ అభివృద్ధి చెందుతుందన్నారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఇరు కుటుంబాల దాడులపై కేసులు నమోదు

బెల్లంకొండ: పెంపుడు కుక్క, ఇంటి ముందు ఉన్న సైడు కాలువ విషయంలో రెండు కుటుంబాలు ఘర్షణకు దిగి, ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. మండలంలోని ఎమ్మాజీగూడెం గ్రామంలో సోమవారం రాత్రి ఈ ఘటన చోటు చేసుకుంది. స్థానిక ఎస్ఐ ఎం.రాజా వివరాల ప్రకారం గ్రామానికి చెందిన నారుమళ్ల రామకోటి, ఇంటి పక్కనే ఉన్న రాజమ్మ కుటుంబ సభ్యుల మధ్య కొద్ది రోజులుగా చిన్న విషయాల్లో వివాదాలు జరుగుతున్నట్లు తెలిపారు. రాత్రి ఇరు కుటుంబాలు గొడవ పడుతూ, ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. రామకోటి కుటుంబ సభ్యులు పలువురికి స్వల్ప గాయాలు కావడంతో, సత్తెనపల్లి ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. రామకోటి కుటుంబ సభ్యులు ఆరుగురిపై, రాజమ్మ కుటుంబానికి చెందిన తొమ్మిది మందిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ పేర్కొన్నారు.

క్రోసూరు సర్కిల్‌లో 10 మద్యం షాపులు

క్రోసూరు: క్రోసూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ స్టేషన్ పరిధిలో 10 మద్యం షాపులకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ఎక్సైజ్‌సీఐ టి.తులసి మంగళవారం తెలిపారు. క్రోసూరు మండలంలో 4, అచ్చంపేట– 4, బెల్లంకొండ –2 షాపులు ప్రారంభించేందుకు లైసెన్సులు ఈ నెల 12న ఇవ్వనున్నట్లు తెలిపారు. ఔత్సాహికులు ఈ నెల 9 వరకు దరఖాస్తులు స్థానిక ఎక్సైజ్ స్టేషన్‌లో ఇవ్వాలన్నారు. 11న నరసరరావుపేటలోని టౌన్ హాల్‌లో జిల్లా కలెక్టర్ లాటరీ తీస్తారన్నారు. ఒక వ్యక్తి ఎన్ని షాపులకైనా దరఖాస్తు చేయవచ్చని, ధరావతు రూ.2 లక్షలని చెప్పారు. లాటరీలో లైసెన్స్ పొందిన వారు మండలంలో షాపు ఎక్కడైనా పెట్టుకోవచ్చునన్నారు. క్రోసూరు, అచ్చంపేట మండలాలల్లో వార్షిక లైసెన్సు ఫీజు రూ.65 లక్షలు, బెల్లంకొండ వార్షిక లైసెన్సు ఫీజు రూ.55 లక్షలని చెప్పారు.

వృద్ధుల హక్కులపై అవగాహన



మాచర్ల: వృద్ధాప్యంలో పిల్లలతో కలిసి ఉంటే మానవులు ఆనందంగా ఉంటారని మాచర్ల సివిల్ జడ్జి కోర్టు ఏపీపీ జి.వెంకటేశ్వర్లు (జీవీ) అన్నారు. ప్రపంచ వృద్ధుల దినోత్సవం సందర్భంగా మంగళవారం న్యాయ అవగాహన సదస్సు న్యాయ సేవా సమితి ఆధ్వర్యంలో ఆర్య వైశ్య వృద్ధాశ్రమంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వృద్ధుల హక్కులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో న్యాయవాదులు గల్లా నాగేశ్వరరావు, ఎన్.శ్రీనివాసరావు, వృద్ధాశ్రమ నిర్వాహకులు పి.చిన్నపిచ్చయ్య పాల్గొన్నారు. వృద్ధులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు.

ప్రభుత్వ ఖాజీగా మౌలానా అబ్దుల్ కరీమ్

పిడుగురాళ్ల: పిడుగురాళ్ల పట్టణ, మండల ప్రభుత్వ ఖాజీగా షేక్ మౌలానా అబ్దుల్ కరీమ్ నియమితులయ్యారు. మంగళవారం పట్టణంలోని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు కార్యాలయంలో ప్రభుత్వ ఖాజీ నియామకపు పత్రాన్ని ఎమ్మెల్యే యరపతినేని చేతుల మీదుగా అందుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ సెల్ ఉపాధ్యక్షులు షేక్ బాబావలి, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు సయ్యద్ అమీర్‌అలీ తదితరులు పాల్గొన్నారు.

లింగాకర్షక బుట్టలతో గులాబీ పురుగు నివారణ



రెంటచింతల: పత్తిలో గులాబీ రంగు పురుగు నివారణపై రైతులు అవగాహన కలిగి ఉండాలని మండల వ్యవసాయ అధికారి బోయపాటి బ్రహ్మరెడ్డి చెప్పారు. మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండలంలోని జెట్టిపాలెం, మల్లవరం గ్రామాలలో ఆయన రైతులకు బీటీ పత్తి పంటను ఆశించే గులాబీ రంగు పురుగు నిర్మూలనకు రైతులు తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలను వివరించారు. లింగాకర్షణ బుట్టలతో పురుగులను నివారించవచ్చని, బుట్టలు కావాల్సిన రైతులు స్థానిక వ్యవసాయ కార్యాలయంలో సంప్రదిస్తే 90 శాతం సబ్సిడీపై అందించేందుకు సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు.

కేజీబీవీలో ఖాళీల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

నరసరావుపేట ఈస్ట్: పల్నాడు జిల్లా పరిధిలోని కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయం (కె.జి.బి.వి)లలో ఖాళీగా ఉన్న బోధనా సిబ్బంది పోస్టులను ఒప్పంద (కాంట్రాక్ట్) ప్రాతిపదికన 2024–25 విద్యాసంవత్సరానికి భర్తీ చేసేందుకు మహిళా అభ్యర్థుల నుంచి ఈనెల 10వ తేదీ వరకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వర్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే బోధనేతర సిబ్బందిని పొరుగు సేవలు (ఔట్ సోర్సింగ్) ప్రాతిపదికన నియమించనున్నట్లు వివరించారు. జిల్లాలోని కస్తూర్బా పాఠశాలల్లో 30 ఖాళీలు ఉన్నట్లు తెలిపారు. అభ్యర్థులు httpr://apkfbv.apcfrr.in వెబ్‌సైట్ ద్వారా రూ.250లు రుసుం చెల్లించి దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు.

కరాటే పోటీలకు విద్యార్థుల ఎంపిక



విద్యార్థులతో హెచ్ఎం సిస్టర్ విజయరాణి, పీఈటీ అచ్చిరెడ్డి

సత్తెనపల్లి: అనంతపురం జిల్లాలో వచ్చే నెలలో జరిగే రాష్ట్ర స్థాయి కరాటే పోటీలకు పట్టణంలోని హోలీ ఫ్యామిలీ ఇంగ్లీష్ మీడియం పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎంపికయ్యారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ గుంటూరు జిల్లా స్థాయి కరాటే పోటీల ఎంపికలు మంగళవారం జరిగాయి. ఈ పోటీల్లో విద్యార్థులు వి.రుత్విక్, కె.కార్తీక్‌వర్మ, ఆకాష్, ఎన్.సుహాస్ జిల్లా జట్టుకు ఎంపికయ్యారు. విద్యార్థులను ప్రధానోపాధ్యాయురాలు సిస్టర్ విజయరాణి, వ్యాయామోపాధ్యాయులు ఎస్.అచ్చిరెడ్డి, అరుణా జ్యోతి, పద్మ, ఉపాధ్యాయులు అభినందించారు.

భావితరాల కోసం పర్యావరణ పరిరక్షణ



విత్తన బంతులను జాజికి అందిస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

కారెంపూడి: పర్యావరణ పరిరక్షణ కోసం కృషి చేస్తున్న ప్రతి ఒక్కరు దేశానికి, భావితరాలకు సేవ చేసినట్టేనని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి పేర్కొన్నారు. స్థానిక జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో తయారు చేసిన ఐదు వేల విత్తన బంతులను పర్యావరణ వేత్త కొమెర అంకారావు (జాజి)కి ఎమ్మెల్యే చేతుల మీదుగా మంగళవారం అందించారు. అంతకు ముందు స్కూల్ గేమ్స్ రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం వాసవీ క్లబ్ 10వ తరగతి విద్యార్థులకు నోట్ బుక్స్, బిస్కెట్ ప్యాకెట్లను ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఉదయం పేటసన్నెగండ్ల గ్రామంలో ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ రాష్ట్ర ప్రతినిధులు శెట్టి హనుమంతరావు, కొలిశెట్టి శివసుబ్రమణ్యం అలాగే వివిధ హోదాల క్లబ్ ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, ఎన్డీఏ కూటమి నాయకులు పాల్గొన్నారు. ఇదిలా ఉంటే స్కూల్ గేమ్స్ నిర్వహణకు పూర్వ విద్యార్థుల తరుపున ఆ సంఘం ప్రతినిధి షేక్ మోదీన్‌సా రూ.10 వేలు ఆర్థికసాయాన్ని నిర్వాహకులకు అందించారు.

● స్వచ్ఛతా హీ సేవా పక్షోత్సవాలలో భాగంగా పేటసన్నెగండ్ల గ్రామంలో పంచాయతీ కార్మికులను ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి చేతుల మీదుగా సన్మానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య పరిరక్షణలో నిత్యం పంచాయతీ కార్మికులు చేస్తున్న సేవలు మరువరానివన్నారు.

అర్హులందరికీ పింఛన్లు



పిడుగురాళ్లలో వృద్ధురాలికి పింఛన్ అందిస్తున్న ఎమ్మెల్యే యరపతినేని



మాచర్లలో పింఛన్ పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్మన్ నరసింహారావు

పిడుగురాళ్ల/మాచర్ల: అర్హులందరికీ పింఛన్లు అందిస్తామని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని 1(చంద్రపాలెం), 31, 32, 33 వార్డులలో లబ్ధిదారులకు మంగళవారం ఆయన పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ పర్వతనేని శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

● మాచర్ల పట్టణంలో మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు మంగళవారం పింఛన్ల పంపిణీ ప్రారంభించారు. పలు ప్రాంతాల్లో పర్యటించి లబ్ధిదారులకు నగదు అందజేశారు. పట్టణంలో 4,600 మంది లబ్ధిదారులు ఉండగా, మంగళవారం సాయంత్రానికి 90 శాతం పంపిణీ పూర్తిచేసినట్టు మున్సిపల్ అధికారులు తెలిపారు.

శాస్త్రీయ దృక్పథం పెంపునకే సైన్స్ సంబరాలు



ఎంపికైన విద్యార్థులతో జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి జేవీకేఎస్ ప్రసాద్

రెంటచింతల: విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపునకు జన విజ్ఞాన వేదిక చెకుముకి సైన్స్ సంబరాలను నిర్వహిస్తున్నట్లు జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి జేవీకేఎస్ ప్రసాద్ చెప్పారు. మంగళవారం స్థానిక సెయింట్ జోసఫ్స్ ఉన్నత పాఠశాల ఆడిటోరియంలో మండలస్థాయి చెకుముకి సైన్స్ పోటీలను నిర్వహించి విజేతలకు ఆయన బహుమతులను అందించారు. అనంతరం ఆయన సెయింట్ జోసఫ్స్ హైస్కూల్ హెచ్ఎం దుర్గాప్రసాద్, యూటీఎఫ్ సీనియర్ నాయకులు, డాక్టర్ ఎంబీ చిన్నమ్మతో కలిసి మాట్లాడారు. మొత్తం 11 పాఠశాలలకు చెందిన 11 జట్లు ఈ పోటీలలో పాల్గొన్నట్లు తెలిపారు. మండల స్థాయిలో ప్రథమ స్థానం కైవసం చేసుకుని జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన స్థానిక రామకృష్ణ గురుకుల పాఠశాల విద్యార్థులు కార్తీకేయ, షైనీ, తనూజ, జెట్టిపాలెం ఏపీ మోడల్ స్కూల్‌కు చెందిన హారిక, బాలగౌతమ్, జ్యోతిలను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నేతలు రాజ్‌కుమార్, ఓర్సు సాగర్‌బాబు పాల్గొన్నారు.

ఎక్సైజ్ సీఐల బాధ్యతల స్వీకరణ



గురజాల ఎక్సైజ్ సీఐ బుజ్జిబాబు



పిడుగురాళ్ల ఎక్సైజ్ సీఐ కర్ణ

గురజాల రూరల్: ఎక్సైజ్ సీఐలు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గురజాల ఎక్సైజ్ సీఐగా బుజ్జిబాబు బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు గురజాల ఎక్సైజ్ సీఐగా విధులు నిర్వహించిన వెంకట రమణ సాధారణ బదిలీల్లో భాగంగా మాచర్లకు వెళ్లారు. బుజ్జిబాబు నరసరావుపేట నుంచి గురజాలకు వచ్చారు. ఆయన మాట్లాడుతూ ఎవరైనా అక్రమ మద్యం కలిగి ఉంటే కఠిన చర్యలు తీసుకుంటామని వివరించారు. గంజాయి వంటి మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని పేర్కొన్నారు.

పిడుగురాళ్ల ఎక్సైజ్ శాఖ సీఐగా కర్ణ

పిడుగురాళ్ల: పిడుగురాళ్ల ఎక్సైజ్ శాఖ సీఐగా కె.కర్ణ మంగళవారం బాధ్యతలను చేపట్టారు. ఆయన బాపట్ల జిల్లా చీరాల నుంచి సాధారణ బదిలీపై పిడుగురాళ్లకు వచ్చారు. ఇక్కడ పని చేసిన సూర్యనారాయణ గూడూరు డివిజన్‌లో వెంకటగిరి ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ అయ్యారు.

ఎక్సైజ్ ఎస్ఐగా కిరణ్..

పిడుగురాళ్ల ఎక్సైజ్ శాఖ ఎస్ఐగా పి.కిరణ్ మంగళవారం బాధ్యతలను స్వీకరించారు. ఇతను సాధారణ బదిలీలలో భాగంగా నెల్లూరు జిల్లా ఆత్మకూరు నుంచి బదిలీపై పిడుగురాళ్ల ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌కు ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



ప్రశంసాపత్రాలు పొందిన విద్యార్థులతో హెచ్ఎం

అచ్చంపేట: ఇంటితోపాటు పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవడం అలవరచుకోవాలని విద్యార్థులకు హెచ్ఎం చిగురుపాటి కల్యాణి సూచించారు. స్థానిక జెడ్పీ హైస్కూలులో మంగళవారం ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సౌజన్యంతో జన చైతన్య సమితి ఆధ్వర్యంలో స్వచ్ఛ హి సేవ, స్వభావ స్వచ్ఛత, సంస్కార స్వచ్ఛతపై వ్యాస రచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించి విజేతలకు ప్రశంసా పత్రం, బహుమతులు ప్రదానం చేశారు. జనచైతన్య సమితి కార్యదర్శి అన్నవరపు స్టాలిన్ బాబు, రమావత్ బద్దూనాయక్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బొల్లవరం పాఠశాలలో స్వచ్ఛతా హి సేవ

బొల్లవరం(ముప్పాళ్ళ): బొల్లవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో దళిత బహుజన రిసోర్సు సెంటర్ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హి సేవ కార్యక్రమం మంగళవారం జరిగింది. విద్యార్థులతో వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై ప్రతిజ్ఞ చేయించారు. డీబీఆర్సీ ఏరియా కో–ఆర్డినేటర్ మేడే వెంకటరమణ మాట్లాడుతూ విద్యార్థులు చదువు పట్ల శ్రద్ధ చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కోటిరెడ్డి, సచివాలయ సిబ్బంది పి.రాంబాబు, రమ్యకృష్ణ, అయ్యప్ప, అనురాధ, వీఆర్వో సంజీవరావు పాల్గొన్నారు.

స్వచ్ఛతపై ప్రతిజ్ఞ

రాజుపాలెం: రాజుపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హి సేవా కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. డీబీఆర్సీ ఏరియా కో–ఆర్డినేటర్ గడ్డిపర్తి కోటిరత్నం విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ప్రధానోపాధ్యాయురాలు శైలజ మాట్లాడుతూ విద్యార్థులు భోజనం చేసే ముందుగా చేతులను శుభ్రపరుచుకోవాలని తెలిపారు. ఉపాధ్యాయులు శివబాబు, శ్రీనివాసరావు, దత్తు విద్యావతి పాల్గొన్నారు.